సాక్షి కామారెడ్డి

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



పరిశోధనలకు వేదికలవ్వాలి

యూనివర్సిటీలు నాణ్యమైన పరిశోధనలకు వేదికలవ్వాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి సూచించారు.

- 8లో ▸



డబుల్ బెడ్‌రూం ఇళ్లేవి?

మద్నూర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు కొన సాగుతున్నాయి.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
39.8 /19.2

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:38	మంగళ : 4:33

న్యూస్‌రీల్

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



కామారెడ్డి టౌన్: రాష్ట్ర మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 3,320 మంది దరఖాస్తు చేసుకోగా.. 2,870 మంది పరీక్ష రాశారు. 450 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల కోసం ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించినట్లు డీఈవో ఎస్.రాజు తెలిపారు.

కాళేశ్వరం నీళ్లు తెస్తా

మంత్రి ప్రశాంత్ రెడ్డి



భీమ్‌గల్ : రివర్స్ పంపింగ్ ద్వారా పోచంపాడ్ ప్రాజెక్ట్‌లోకి వచ్చిన కాళేశ్వరం నీటిని భీమ్‌గల్ ప్రాంతానికి కచ్చితంగా తీసుకొస్తానని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బడా భీమ్‌గల్ క్లస్టర్ పరిధిలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన సతీమణి నీరజారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం, బలగం అన్నారు. పార్టీపై విధేయత, నాయకుని మాట జవ దాటకుండా పూర్తి విశ్వాసంగా ఉండటం, ఎన్నుకున్న ప్రజలకు నమ్ముకున్న కార్యకర్తలకు పార్టీలకు అతీతంగా సేవ చేయాలని తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి తనకు సూచించారన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మోదీ అవినీతిని కేసీఆర్ ప్రశ్నిస్తున్నందునే ఆయన బిడ్డ ఎమ్మెల్సీ కవితను వేధిస్తున్నారన్నారు. అనంతరం పార్టీ శ్రేణులకు మంత్రి దంపతులు భోజనాలు వడ్డించి వారికి కలిసి భోజనం చేశారు. డీసీసీబీ వైస్ చైర్మెన్ రమేశ్ రెడ్డి, మధుశేఖర్, భీమ్‌గల్ మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ఆయా గ్రామాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు సతీ సమేతంగా పాల్గొన్నారు.

భయపెడుతున్న మబ్బులు

ఎన్నో ఆశలతో యాసంగిలో వరి సాగు చేసిన రైతులకు ఆది నుంచి కష్టాలు వెంటాడుతున్నాయి. పంట వేయగానే ఉల్లికోడు, మొగిపురుగు ఆశించి నష్టం చేయగా.. కోతకు వచ్చే సమయంలో మెడ విరుపు, కొంకి రోగం రావడంతో గింజలు తాలు అయ్యాయి. పురుగు మందులు కొట్టి కాపాడగా మిగిలిన పంటను కోసి అరబెడితే మబ్బులు భయపెడుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో చేతికొచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



భవానీపేట కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం

- పేరుకుపోతున్న ధాన్యం కుప్పలు
- ఈదురు గాలులు, చిరుజల్లులతో రైతుల ఆందోళన
- ధాన్యం రాశుల వద్దే పడిగాపులు
- వడ్లు కాంటా వేయాలని వేడుకలు

నాగిరెడ్డిపేట/లింగంపేట: జిల్లాలో యాసంగి వరి కోతలు ఊపందుకున్నాయి. వారం, పది రోజులుగా జిల్లాలోని పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభించిన రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఇప్పటికే పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు పేరుకుపోయాయి. రైతులు వారం, పది రోజులుగా రాత్రింబవళ్లు ధాన్యం రాసుల వద్ద కాపలాగా ఉంటున్నారు. కాగా నాలుగు రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రివేళ ఆకాశం మబ్బులు పట్టడంతోపాటు ఈదురుగాలులు వీస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పలుగా చేసి వాటిపై టార్పాలిన్లను కప్పుతున్నారు.

ప్రారంభం కాని కేంద్రాలు

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ఇప్పటివరకు జిల్లా అధికారులు ప్రారంభించిన దాఖలాలు కనిపించడంలేదు. బాన్సువాడ మండలంలోని ఇబ్రహింపటణంలో మాత్రమే కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల ఆధ్వర్యంలో 320, ఐకేపీ ఆధ్వర్యంలో 30 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు 1.45 కోట్ల గన్నీ సంచులు అవసరం ఉండగా 60 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు గతంలో కేంద్రాలు కొనసాగిన ప్రాంతంలో రైతులు వడ్లు ఆరబోశారు. ఆయా కేంద్రాల్లో అధికారులు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు మండుతుండడంతో కేంద్రాల వద్ద రైతులు నీడలేక చెట్లను ఆశ్రయిస్తున్నారు. తాగడానికి మంచినీళ్లు లేవు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ధాన్యం తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.



ధాన్యం ఆరబెడుతున్న మహిళా రైతులు

వెంటనే ప్రారంభించాలి



మేము పంట కోసి సుమారు నెలరోజులు అవుతోంది. ధాన్యాన్ని ఆరబెట్టి కుప్ప చేశాం. కానీ రోజు వాన మొగులు అయితుండటంతో భయమైతుంది. మంచిగా ఆరిన వడ్లు ఎక్కడ తడుస్తాయోనని ఆందోళనగా ఉంది. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి వడ్లు కాంటా చేయాలి.

– విఠల్, రైతు, బిజుగంచెరువు తండా, నాగిరెడ్డిపేట మండలం

వర్షం వస్తే మళ్లీ కష్టాలే..



ఈ యేడు పంటల సాగులో మాకు చాలా కష్టాలు వచ్చాయి. అన్ని కష్టాలను ఎదు ర్కొని సాగు పూర్తి చేశాం. కానీ ఆఖరికి ధాన్యం అమ్మేటప్పుడు సైతం ఇబ్బందులు తప్పేలా లేవు. వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని అధికారులు ధాన్యం తూకాన్ని ప్రారంభించాలి.

– జౌలిబాయి, మహాదేవుని గడ్డతండా

రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తాం..

జిల్లా అధికారులకు ఎక్కడెక్కడ ధాన్యం ఎక్కువగా వచ్చిందనే సమాచారం ఇచ్చాం. ఇప్పటికే గన్నీ బ్యాగులు కేంద్రాలకు తరలించాం. సివిల్ సప్లై అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈనెల 20లోపు పెద్ద సెంటర్లలో కొనుగోళ్లు ప్రారంభిస్తాం. వసతులు సైతం త్వరలో కల్పిస్తాం.

– అనిల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, లింగంపేట

ఆది నుంచి కష్టాలే..

ఈ ఏడాది యాసంగి పంటల సాగులో రైతులను ఆది నుంచి కష్టాలు వెంటాడుతున్నాయి. పంట వేసిన నాటి నుంచే తెగుళ్లు ఆశించాయి. కోత దశకు చేరిన తరుణంలోనూ తెగుళ్లు నష్టపరిచాయి. వ్యయప్రయాసలకోర్చి సాగుచేసిన పంటల దిగుబడి సైతం అంతంత మాత్రంగానే వచ్చింది. పంటలను కోయగా వచ్చిన ధాన్యాన్ని రైతులు గ్రామ శివారులోని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రాంతాలకు తరలించారు. పంటసాగులో మొదటి నుంచి వచ్చిన కష్టాలకు తోడు చివరికి ధాన్యం విక్రయించే దశలోనూ తమకు ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. నాలుగు రోజులుగా ఈదురుగాలితో కూడిన చిరుజల్లులు పడుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చేతికొచ్చిన ధాన్యం తడిసి పోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.



పది రోజులు అవుతోంది



వరి కోత చేసి పది రోజులు అవుతోంది. కేంద్రానికి తరలించి ధాన్యం ఆరబెట్టి రాశి పోశాను. పగలు ఎండ దెబ్బ, రాత్రి వడ గాలులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రాత్రింబవళ్లు వడ్ల దగ్గరే కాపలా ఉంటున్నా. అధికారులు స్పందించి తొందరగా కొనుగోళ్లు ప్రారంభించాలి. రాత్రి వేళ ధాన్యం రాసులపై పడుకుంటున్నాం. – సల్ల కిష్టయ్య, అయ్యపల్లి

వసతులు కల్పించాలి



కొనుగోలు కేంద్రంలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. తాగునీరు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నాం. రాత్రి వేళ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. లేదంటే దొంగలు ధాన్యం ఎత్తుకెళ్లే అవకాశం ఉంది. అధికారులు కొనుగోళ్లు ప్రారంభించి తాగునీరు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి.

– సల్ల యాదయ్య, అయ్యపల్లి

పింఛన్ తీసేస్తే పీక నొక్కుతరు

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ హెచ్చరిక
- పెద్దమల్లారెడ్డిలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర



మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ.. బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భిక్కనూరు: కాంగ్రెస్‌లో చేరాలనుకుంటున్న వారి కుటుంబాలు, కాంగ్రెస్ మద్దతుదారుల పింఛన్లను తీసేస్తామని బీఆర్ఎస్ నాయకులు బెదిరిస్తున్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. పింఛన్లు తీసేస్తే వారి పీకలను ప్రజలు నొక్కుతారని హెచ్చరించారు. ఆదివారం పెద్దమల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ హథ్ సే హథ్ జోడో యాత్ర నిర్వహించింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల జేబులోనుంచి పింఛన్లు ఇవ్వడం లేదన్నారు. ప్రజలు చెల్లించిన పన్నుల నుంచే ఇస్తున్నారన్నారు. పింఛన్ పోతుందని ఎవరూ భయపడవద్దని, ఒకవేళ తొలగిస్తే తాను సొంతంగా ప్రతి నెలా ఐదో తేదీలోగా డబ్బులిస్తానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ. 3,500 నుంచి రూ. 4 వేల వరకు పెంచుతుందని, ఈ విషయాన్ని త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే సభలో ప్రియాంక గాంధీ ప్రకటిస్తారని పేర్కొన్నారు. కేసీఆర్ మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నాడని, ఇక ఆయన మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు తిర్మల్‌స్వామి, నాయకులు స్వామి, బండి నవీన్‌గౌడ్, బాగారెడ్డి, ధర్మయ్య, ద్యాగల కిరణ్, కొట్టని స్వామి తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌ను సందర్శించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథితో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

డిచ్‌పల్లి : రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం డిచ్‌పల్లిలోని టీఎస్ఎస్‌పీ ఏడో బెటాలియన్‌ను సందర్శించారు. జిల్లా అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్, నిజామాబాద్ ఆర్డీవో రవి, డీపీవో జయసుధ, కమాండెంట్ ఎన్‌వీ సత్య శ్రీనివాసరావు ఆయనకు స్వాగతం పలికారు. బెటాలియన్ పోలీసులు ఆయనకు గౌరవవందనం సమర్పించారు. అనంతరం బెటాలియన్ అతిథి గృహంలో జిల్లా అధికారులతో ఎన్నికల కమిషనర్ సమీక్ష నిర్వహించారు.

'సీపీఎస్ రద్దు చేయాల్సిందే'

కామారెడ్డిటౌన్: సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సిరిసిల్ల రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధులు మీదుగా సాగింది. అనంతరం సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడారు. టీఎస్‌సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుంటా ఎల్లారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రిటైర్‌మెంట్ తర్వాత ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. సీపీఎస్ రద్దయ్యే వరకు ఉద్యోగులు పోరాటం ఆగదన్నారు. త్వరలో జరగబోయే రాజకీయ రణ రంగ సభను విజయవంతం చేయాలని, ఓపీఎస్ ఆకాంక్షను ప్రభుత్వానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. బాణాల భాస్కర్ రెడ్డి, చింతల లింగం, మధు, విజయ్‌వర్ధన్, విఠల్‌యాదవ్, మోహన్, బాల్‌సింగ్, అనిల్‌కుమార్, సురేందర్, నరేష్‌రెడ్డి, ప్రవీణ్, చంద్రశేఖర్, సురేష్, మహేష్, మనోహర్ రావు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

రుణ యాప్ నిర్వాహకుల వేధింపులు

- స్నేహితులు, బంధువులకు అశ్లీల చిత్రాలు పంపుతామని బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

కామారెడ్డి క్రైం: లోన్‌యాప్‌ల బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఓ కంపెనీకి చెందిన లోన్ యాప్ ద్వారా రుణం తీసుకున్న వ్యక్తిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వేధిస్తున్న సంఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగాపూర్‌కు చెందిన గోపాల్ వ్యవసాయం చేస్తుంటాడు. డబ్బులు అవసరం ఉండడంతో గతనెలలో క్రెడిట్ బి అనే లోన్ యాప్ ద్వారా రూ. 19 వేల రుణం తీసుకున్నాడు. రుణం తీసుకున్నప్పుడు లోన్‌యాప్ గోపాల్‌కు చెందిన సెల్‌ఫోన్ నంబర్, వ్యక్తిగత వివరాలు, ఫోన్ యాక్సెస్ మొత్తం తీసుకుంది. గోపాల్ వారం వారం రుణ వాయిదాలను సక్రమంగానే చెల్లిస్తున్నాడు. ఇప్పటివరకు ఆరు వాయిదాలు చెల్లించాడు. అయితే వారం రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు గోపాల్‌కు ఫోన్ చేస్తూ డబ్బులు ఇవ్వాలని, లేదంటే అశ్లీల చిత్రాలను తయారు చేసి స్నేహితులు, బంధువులకు పంపిస్తామని బెదిరిస్తున్నారు. వారి బెదిరింపులకు భయపడి మూడు రోజుల క్రితం వారు చెప్పిన ఫోన్ నంబర్‌కు ఫోన్ పే ద్వారా రూ.3,800 పంపాడు. అయినా మరుసటి రోజు నుంచే వేధింపులు కొనసాగాయి. దీంతో బాధితుడు ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

కేటీఆర్ సారూ.. ఎల్లారెడ్డికి వచ్చిపోరూ?

ఎల్లారెడ్డి బల్దియాపై మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శీతకన్ను వేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంత్రిగా ఆయన ఒక్కసారి కూడా ఇక్కడికి రాకపోవడం ఈ విమర్శలకు కారణం. మంత్రి పర్యటిస్తే పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశతో ప్రజలున్నారు. ఒక్కసారి వచ్చిపోవాలని కోరుతున్నారు.



ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంతెన

ఎల్లారెడ్డి: రాష్ట్ర పాలనలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఎల్లారెడ్డి బల్దియాకు ఇంతవరకు ఒక్కసారి కూడా రాలేదు. నియోజకవర్గంలోనూ ఆయన ఒక్కసారి మాత్రమే పర్యటించారు. ఎన్నికల ప్రచార సభలతోపాటు రాష్ట్రంలో మిషన్ కాకతీయ ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలకు సీఎం కేసీఆర్ ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వచ్చి వెళ్లారు. మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి పలుమార్లు పర్యటించారు. వారు రాష్ట్ర సాధనోద్యమ సమయంలోనూ చాలాసార్లు నియోజకవర్గానికి వచ్చారు. అయితే ఉద్యమ సమయంలోనూ కేటీఆర్ ఎల్లారెడ్డికి రాలేదని, ఎలాంటి కార్యక్రమంలోనూ పాల్గొనలేదని బీఆర్ఎస్ నేతలే పేర్కొంటున్నారు. మాజీ శాసనసభ్యుడు రవీందర్‌రెడ్డి కోరిక మేరకు 2018లో ఎన్నికల ప్రచారంలో భాగంగా లింగంపేట మండల కేంద్రంలో జరిగిన సభలో పాల్గొన్నారు. మరే సందర్భంలోనూ కేటీఆర్ రాలేదు. అయితే మాజీ శాసనసభ్యుడు రవీందర్ రెడ్డి అప్పట్లో మంత్రి హరీశ్‌రావుకు ముఖ్య అనుచరుడిగా మెలిగిన కారణంగా నియోజకవర్గంలో కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేటీఆర్ సుముఖత చూపలేదన్న అభిప్రాయం బీఆర్ఎస్ నేతల్లో ఉంది. కానీ కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి కేటీఆర్ ప్రోద్బలంతోనే బీఆర్ఎస్‌లో చేరిన ప్రస్తుత శాసనసభ్యుడు జాజాల సురేందర్‌కు ఆయనతో మంచి సంబంధాలే ఉన్నాయి. అయినా కేటీఆర్ నియోజకవర్గంలో ఎలాంటి కార్యక్రమాలకు రాకపోవడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై తొమ్మిదేళ్లు కావస్తున్నా కేటీఆర్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమంలోనూ పాల్గొనకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇవీ సమస్యలు..

ఎల్లారెడ్డి మున్సిపాలిటీగా మారినా.. అభివృద్ధిలో వేగం పెరగలేదు. బల్దియాలో విలీనమైన ఛత్రునాయక్ తండాకు ఇప్పటివరకు సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదు. ఎల్లారెడ్డి నుంచి బాలాజీనగర్ తండా వరకు డివైడర్‌తోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. లింగారెడ్డిపేట నుంచి ఎస్సీ కాలనీ వరకు చెరువు కట్ట మీదుగా సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దేవునిపల్లి గ్రామంలో కొన్ని కాలనీలలో డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.



ఎల్లారెడ్డిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాల్సిన స్థలం

విలీన గ్రామాలలో మురికి కాలువలను శుభ్రం చేయడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారిపై డ్రెయినేజీ ఒకవైపు మాత్రమే.. అదీ సగం వరకే నిర్మించారు. మంత్రి కేటీఆర్ పర్యటిస్తే ఆయా సమస్యలకు మోక్షం లభిస్తుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

జిల్లాకు వస్తున్నా..

జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలలో కేటీఆర్ పలుమార్లు పర్యటించినా.. ఎల్లారెడ్డివైపు మాత్రం కన్నెత్తి చూడలేదు. ఇటీవల జరిగిన ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన తప్పకుండా వస్తారని భావించినా.. ఆఖరి నిమిషంలో పర్యటన రద్దయ్యింది. మరోవైపు ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటిస్తే వచ్చే ఎన్నికలలో పార్టీకి బలం చేకూరుతుందన్న ఆలోచనలో స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం ఉంది. ఆ దిశగా పార్టీ నాయకులు కూడా గట్టిగానే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎల్లారెడ్డి పట్టణ శివారులోని పెద్ద చెరువుపై రూ. 5 కోట్లతో నిర్మించిన కాజ్‌వే ప్రారంభోత్సవం, పట్టణంలో రూ. 2 కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు శంకుస్థాపన, రూ.15 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు భూమిపూజ తదితర అభివృద్ధి పనులను కేటీఆర్‌తో ప్రారంభింపజేసేందుకు ఎమ్మెల్యే సన్నాహాలు చేస్తున్నారు. కాజ్‌వే నిర్మాణం పూర్తై ఏడాది దాటింది. కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించాలన్న ఉద్దేశంతో.. ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి పర్యటించాలని కార్యకర్తలు కోరుతున్నారు.

క్లుప్తంగా

సమస్యను పరిష్కరించండి



మోర్తాడ్: జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా కమ్మర్‌పల్లిలో ఇళ్లకు నష్టం జరుగకుండా బైపాస్ రోడ్డును నిర్మించి, సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం పలువురు గ్రామస్తులు బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ అర్వింద్‌ను ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఎంపీ అర్వింద్ స్పందిస్తూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని బాధితులు వివరించారు. నాయకులు దేవేందర్, గంగారాం, గంగాధర్, రమణయ్య, రమేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకో హఠావో.. దేశ్‌కో బచావో'

ఆర్మూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీకో హఠావో.. దేశ్‌కో బచావో నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కారవ్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పేర్కొన్నారు. ఆర్మూర్‌లోని పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 14నుంచి వచ్చే నెల 15వరకు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిపక్షాలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నియోజకవర్గం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు భూమయ్య, సుధాకర్, ఓమయ్య, సాయిలు, శ్రీనివాస్ ఉన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



భూమయ్య మృతదేహం

బాన్సువాడ రూరల్: పట్టణంలో ఓ వ్యక్తి కుటుంబకలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన జంగం భూమయ్య(50) తన కుటుంబంతో కలిసి బాన్సువాడలో నివాసించేవాడు. కూలిపని చేసుకునే భూమయ్య గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసై పని లేకుండా ఉంటున్నాడు. కుటుంబ పోషణ కోసం ఏదైనా కూలి పని చేయాలని భార్య కోరగా తరచూ ఆమెతో గొడవ పడుతూ కొట్లాడేవాడు. ఈక్రమంలో శనివారం రాత్రి కూడా భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రపోగా ఇంటిబయటకు వచ్చిన భూమయ్య మెట్ల కోసం ఉంచిన ఇనుపరాడ్‌కు ఉరేసుకున్నాడు. ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసుకులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విక్రయించిన శిశువు ఐసీపీఎస్‌కు అప్పగింత



రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండలంలోని ఓ తండా చెందిన మహిళ అప్పుడే పుట్టిన పసిపాపను మార్చి 18న గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మేసింది. దీంతో ఐసీపీఎస్ అధికారులు ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది ఫిర్యాదుతో రామారెడ్డి పోలీసులు గాలించి, నిజామాబాద్‌లో ఆ తల్లి అమ్మేసిన బిడ్డను గుర్తించారు. ఆదివారం ఆ పాపను రామారెడ్డి పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లి సమక్షంలో ఐసీపీఎస్ (ఇంటిగ్రేటెడ్ చిల్డ్రన్ ప్రొటెక్షన్ సర్వీసెస్)కు అప్పగించారు. నిజామాబాద్‌లోని శిశుసంక్షేమశాఖ అధీనంలో నిర్వహించే శిశుగృహంలో పాపను ఉంచనున్నట్లుగా సమాచారం.

పరిశోధనలకు వేదికలవ్వాలి

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి
- తెయూలో కొనసాగుతున్న ఆన్‌సైట్ రీసెర్చ్ మెథడాలజీ కోర్సు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

తెయూ(డిచ్‌పల్లి): నాణ్యమైన పరిశోధనలకు విశ్వవిద్యాలయాలు గొప్ప వేదికలు కావాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో కొనసాగుతున్న ఆన్‌సైట్ రీసెర్చ్ మెథడాలజీ కోర్సులో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశోధన ఫలితాలతో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యున్నత విశ్వవిద్యాలయాల పరిశోధక విద్యార్థులు, యంగ్ ఫ్యాకల్టీ తెలంగాణ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న రీసెర్చ్ మెథడాలజీ కోర్సుకు హాజరు కావడం గర్వకారణమన్నారు. పరిశోధనలు స్థూలంగా మెజారిటీ ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలకు పరిష్కారాలు కనుగొనే దిశగా ఉండాలని సూచించారు. ప్రభుత్వాలు గొప్ప పరిశోధనలతోనే నూతన పథకాలను ప్రవేశపెడుతున్నాయని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పరిశోధనలు ఉండాలని ఆయన పేర్కొన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో పరిశోధనలు కొనసాగాలన్నారు. ఉదయం జరిగిన మొదటి రెండు సెషన్లలో ప్రొఫెసర్ ఎస్ఎఫ్ చంద్రశేఖర్ స్టాటిస్టికల్ టూల్స్ ప్యాకేజీలో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పున్నయ్య, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలతో ముందుకెళ్లాలి..



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న బహుజనులు

సుభాష్‌నగర్: బహుజనులు ఐక్యంగా ఉండి బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనతో ముందుకెళ్లాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి సూచించారు. బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన ఛలో నిజామాబాద్ కార్యక్రమంలో భాగంగా బహుజన మహనీయుల జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అంతకుముందు పులాంగ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అక్కడి నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు కొనసాగింది. అనంతరం వేదిక జిల్లా అధ్యక్షుడు యాట ప్రతాప్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ.. బహుజనులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన వక్త వీజీఆర్ నారగోని, వేదిక రాష్ట్ర కో–ఆర్డినేటర్ జిలకర శ్రీనివాస్, నాయకులు సురేష్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

వీడీసీలు గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కుంచాల సునీత

పెర్కిట్(ఆర్మూర్): గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ)లు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ కుంచాల సునీత సూచించారు. అంకాపూర్ గ్రామంలో ఆదివారం ఆమె అగ్రి లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. వీడీసీలు గ్రామాల్లో జరిమానాలు, బహిష్కరణలు వంటి పనులకు పాల్పడవద్దన్నారు. అలాగే రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. రైతులు మోసాలకు గురికాకుండా ఉండడానికి రాష్ట్ర వ్యాప్తంగా అగ్రి లీగల్ ఏయిడ్ క్లీనిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ మచ్చర్ల పూజిత కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ.. అంకాపూర్‌లో రైతులంత సమిష్టి కృషితో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు న్యాయమూర్తికి వివరించారు. అనంతరం న్యాయమూర్తులను ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నారెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు సన్మానించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'అగ్నిమాపక విన్యాసాలు'



ఖలీల్‌వాడి: నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలోగల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆదివారం అగ్నిమాపకశాఖ వారోత్సవాలలో భాగంగా సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని నివారించడానికి విన్యాసాలు నిర్వహించారు. అగ్నిమాపక కేంద్ర ధికారి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది హాస్పిటల్‌లో వైద్య సిబ్బందికి, రోగుల బంధువులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తిరుపతి, సుధాకర్, అవిష్‌కుమార్, హనుమాన్‌చారి, వారిస్‌హైమద్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

మరణంలోనూ వీడని స్నేహం

- పిట్లం మండలంలో లారీని ఢీకొన్న బైక్
- తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు..
- చికిత్సపొందుతూ మృతి
- నర్సింగ్‌రావ్‌పల్లిలో విషాదఛాయలు



సుబ్బురిరాజు, జలంధర్‌గౌడ్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): హనుమాన్ మాలధారణ సమయంలో ఇద్దరి మధ్య ఏర్పడ్డ స్నేహం మరణంలోను వీడలేరు. పిట్లం మండలంలోని నాందేడ్–సంగారెడ్డి జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు తీవ్రంగా గాయపడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామానికి చెందిన సుబ్బురిరాజు(35), బంగ్లింటి జలంధర్‌గౌడ్ (20) కొన్ని రోజుల కిందట గ్రామంలో హనుమాన్ మాలధారణ స్వీకరించారు. ఈసమయంలోనే వారి మధ్య స్నేహం ఏర్పడింది. ఇటీవల జరిగిన హనుమాన్ జయంతి రోజున వారు మాలవిరమణ చేశారు. ఈక్రమంలో శనివారం ఇరువురు బైక్‌పై పిట్లంకు వెళ్లారు. పని ముగిసిన తర్వాత స్వగ్రామానికి బయలుదేరారు. పిట్లం మండలంలోని నాందేడ్– సంగారెడ్డి జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో రావడంతో వారు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆదివారం వేకువజామున సంగారెడ్డి ఆస్పత్రిలో సుబ్బురిరాజు, హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో జలంధర్‌గౌడ్ చికిత్స పొందుతూ మృతిచెందారు. జలంధర్‌గౌడ్ హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తుండేవాడు. మాలధారణ కోసం నెల రోజుల కిందట స్వగ్రామానికి వచ్చాడు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడటంతో నర్సింగ్‌రావ్‌పల్లిలో తీవ్ర విషాదం నెలకొంది.

తాళం వేసిన దుకాణంలో చోరీ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ అన్నపూర్ణ కాలనీలో తాళం వేసిన బట్టల వ్యాపారి(గోదాం) దుకాణంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కోటార్మూర్‌కు చెందిన సామల్ వరిదాస్ బట్టల వ్యాపారి. అతని వద్ద ఉండే ఐదుగురు గ్రామాల్లో తిరుగుతూ బట్టలు విక్రయిస్తారు. ఆదివారం గ్రామంలో ఊర పండుగ ఉండటంతో ఎటూ వెళ్లలేదు. ఈనెల 18న బట్టల ఖరీదు కోసం రూ.1లక్ష 50వేలును దుకాణంలో ఉంచారు. ఉదయం 8గంటల సమయంలో అందరు కలిసి టీ తాగడానికి బయటకు వెళ్లి వచ్చేసరికి తాళం ధ్వంసం చేసి లోపల ఉన్న నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని చోరీ తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సైని దూషించిన ఎంపీపీపై కేసు

ఇందల్వాయి: తన మాట వినని ఇందల్వాయి ఎస్సై నరేష్‌ను ఎంపీపీ రమేష్ నాయక్ దూషించడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మోతిరాం తెలిపారు. వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం దేవితండాకు చెందిన మూడ్ విఠల్, మూడ్ దోన్‌సింగ్, మూడ్ మున్నాలు కలిసి గన్నారం గ్రామానికి చెందిన గడ్డం నడ్పి రాజన్నకు చెందిన మామిడి తోటలో శనివారం రాత్రి మామిడికాయలు దొంగలించారు. దీంతో రాజన్న వారిని పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ఇది చిన్న విషయమని నిందితులపై కేసు నమోదు చేయవద్దని ఎస్సైకి సూచించాడు. కానీ ఎస్సై నిందితులపై కేసు నమోదు చేసి, విచారించాడు. దీంతో ఎంపీపీ తన అనుచరులు గండితండా సర్పంచ్ కుమార్, రూప్లానాయక్ తండా రాజు నాయక్ తదితరులతో పోలీస్ స్టేషన్‌కి చేరుకొని ఎస్సైని దుర్భాషలాడాడు. దీంతో ఎంపీపీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లోని సీసీ టీవీ ఫుటేజీలను ఇవ్వాల్సిందిగా మీడియ ప్రతినిదులు ఎస్సైని కోరగా సీఐని సంప్రదించాలని తెలిపారు. సీఐని సంప్రదించగా టెక్నీషియన్ రావాలని తెలిపారు.

కెనాల్‌లో స్నానానికి వెళ్లి బాలుడి మృతి




షేక్ సోహైల్ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నిజాంసాగర్ కెనాల్‌లో స్నానానికి వెళ్లిన ఓ బాలుడు ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. పెయింటర్స్ కాలనీకి చెందిన షేక్ సొహైల్(17) ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు తన మిత్రులతో కలిసి నిజాంసాగర్ కెనాల్‌లో స్నానం చేయడానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా ఈత రాకపోవడంతో సొహైల్ నీట మునిగి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పంచానామా నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెట్టు పైనుంచి జారిపడి ఒకరు..

ధర్పల్లి: మండలంలోని ప్రాజెక్టు రామడుగు గ్రామంలో చెట్టు పైనున్న తేనెటీగల తెట్టెను తొలగించడానికి వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారిపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన నాయుడు బుచ్చన్న(50) ఆదివారం గ్రామంలోని మామిడి చెట్టుపై ఉన్న తేనెటీగల తెట్టెను తొలగించడానికి చెట్టు పైకి ఎక్కాడు. తేనెటీగలను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందకు జారిపడ్డాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒకరి అదృశ్యం



శేఖర్

నిజామాబాద్ సిటీ: నవీపేట్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన శేఖర్ అదృశ్యమైనట్లు ఎస్సై లింబాద్రి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. ధర్మారం గ్రామానికి చెందిన శేఖర్ ఈ నెల 13న నిజామాబాద్ కలెక్టరేట్‌లోని దేవదాయ శాఖలో పని ఉందని చెప్పి, ఇంటి నుంచి బయలుదేరాడు. ఇప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. అతని కుటుంబసభ్యులు ఎంత వెతికిన ఆచూకి లభ్యం కాలేదు. దీంతో భర్త కనిపించటం లేదని అతని భార్య లక్ష్మీ ఆదివారం నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాల 1997-98 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనాలు



అంకాపూర్‌లోని భార్గవి విద్యానికేతన్ స్కూల్ 1995-96 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్)/బాల్కొండ/బీబీపేట/నిజామాబాద్ సిటీ/జక్రాన్‌పల్లి/గాంధారి: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వివిధ పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా దశాబ్దాల తర్వాత తిరిగి కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు.



మాందాపూర్ జెడ్పీహెచ్ఎస్ 1997-98 ఎస్సెస్సీ విద్యార్థులు



గుండారం జెడ్పీహెచ్ఎస్ 2002-03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



జక్రాన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ 1983-84 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



గాంధారి జెడ్పీహెచ్ఎస్ 2002-03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

నాణ్యమైన వైద్యసేవలందించాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ జిల్లాల ఫిజీషియన్లు

నిజామాబాద్ సిటీ: వైద్యులు నూతన చికిత్స పద్ధతులపై అవగాహన కల్పించుకుంటూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు సూచించారు.నగరంలో ఆదివారం రాష్ట్ర ఫిజీషియన్ల వైద్యుల సంఘం(ఏపీఐ తెలంగాణ) ఆధ్వర్యంలో 'అధునాతన చికిత్స పద్ధతులపై రాష్ట్రస్థాయి శిక్షణ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు, విశిష్ట అతిథిగా రాష్ట్ర ఏపీఐ చైర్మన్ డాక్టర్ నాగేంధర్‌లు విచ్చేసి, సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్ రావు మాట్లాడుతూ.. శిక్షణ తరగతులు వైద్యులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ప్రస్తుత తరుణంలో వైద్య రంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, వీటిపట్ల ఎప్పటికప్పుడు అవగాహన కల్పించుకుంటూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న వివిధ జిల్లాల వైద్యులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఏపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారావు, రాష్ట్ర చైర్మన్ రమేష్, మాజీ చైర్మన్ చంద్రశేఖర్, కోశాధికారి త్రిలోక్ చందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఇందిర, ప్రభుత్వ ఆస్పత్రి పర్యవేక్షకులు ప్రతిమా రాజ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ హోలాండ్ ట్రాక్టర్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న అరవింద్, దినేష్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులు పెరగడానికి న్యూ హోలాండ్ ట్రాక్టర్ పరికరాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతాయని న్యూ హోలాండ్ ట్రాక్టర్ షోరూం యజమాని నల్ల దినేష్‌రెడ్డి తెలిపారు. నగరంలోని హైదరాబాద్‌రోడ్డు(మాధవనగర్) సమీపంలో ఏర్పాటు చేసిన షోరూంను ఆదివారం న్యూ హోలాండ్ ట్రాక్టర్ తెలంగాణ, ఏపీ రీజినల్ మేనేజర్ అరవింద్‌కుమార్, షోరూం యజమాని నల్ల దినేష్‌రెడ్డిలు కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా దినేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోకెల్లా అత్యాధునిక టెక్నాలజీ కలిగిన న్యూ హోలాండ్ యంత్ర పరికరాలను జిల్లా రైతులకు అలవాటు చేసి జిల్లాలో పంటల దిగుబడి పెరిగేలా ఒక లక్ష్యంతో షోరూంను ప్రారంభించామన్నారు. మొదటి రెండు ట్రాక్టర్లను బిచ్కుంద మండలం డోంగ్లి గ్రామానికి చెందిన మేత్రి విట్టల్, దోంప్రేవార్ లక్ష్మణ్‌లకు అందజేశారు. షోరూం సీఈవో నల్ల ప్రతిహాస్‌రెడ్డి, ఏరియా మేనేజర్ నవీన్‌కుమార్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలే టార్గెట్‌గా చోరీలు

- మద్నూర్ మండలంలో నెల రోజుల్లో నాలుగు బైక్‌ల అపహరణ

మద్నూర్(జుక్కల్): మండలంలో బైక్ చోరీలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఏదో ఒక చోట ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతుండటంతో ఇంటి బయట రాత్రి సమయాల్లో బైక్‌లను పార్కింగ్ చేయాలంటే వాహనదారులు జంకుతున్నారు. వారం రోజుల కిందట మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు తెప్పవార్ తుకారం తన బైక్‌ను రాత్రి ఇంటి వద్ద పార్కింగ్ చేయగా.. తెల్లారి చూసేసరికి చోరీకి గురైంది. మద్నూర్‌కు చెందిన సక్కర్లావార్ బలరాంకు చెందిన బైక్‌ను ఐదు రోజుల కిందట పెద్ద శక్కర్గాలోని పత్తి ఫ్యాక్టరీ ముందు నిలిపగా దుండగులు చోరీ చేశారు. అలాగే మండలంలోని హండెకేలూర్‌కు చెందిన వ్యక్తి మద్నూర్‌లోని వైన్స్ వద్ద నిలపగా చోరీకి గురైంది. మద్నూర్‌కు చెందిన నల్లావార్ రవికి చెందిన యూనికార్న్ బైక్ పది రోజుల కిందట మద్నూర్‌కు సమీపంలోని ఓ దుకాణం ముందు నిలిపిన పావుగంటకే చోరీకి గురైంది. నాలుగు రోజుల కిందట యూనికార్న్ బైక్‌ను చోరీ చేసిన దుండగులు హైదరాబాద్ వైపునకు వెళ్తుండగా మెదక్ జిల్లా నిజాంపేట్ సమీపంలో లారీని ఢీకొన్నారు. పోలీసులు విచారణ చేపట్టగా బైక్ చోరీకి గురైందని తెలుసుకొని మద్నూర్ పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు మహారాష్ట్రలోని పిప్పిల్‌గావ్‌కు చెందిన వ్యక్తి బైక్‌ను చోరీ చేసినట్లు తెలిసిందని మద్నూర్ పోలీసులు తెలిపారు. మద్నూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్నిచోట్ల పని చేయక పోవడంతో దుండగులను గుర్తించడం కష్టమవుతోంది. ఈవిషయమై మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. బైక్‌ల చోరీలపై దర్యాప్తు జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. త్వరలో బైక్ చోరీలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.